క్లుప్తంగా

నేడు సచివాలయ భవనాలు ప్రారంభం

రాయవరం: మండలంలోని వెంటూరులో శనివారం ఉదయం 10 గంటలకు సచివాలయ భవనాలను ప్రారంభిస్తున్నట్టు ఎంపీపీ నౌడు వెంకటరమణ తెలిపారు. వెంటూరు గ్రామంలో నిర్మించిన సచివాలయం-1, సచివాలయం-2 భవనాలను ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ప్రారంభిస్తారన్నారు. అదేవిధంగా మ ధ్యాహ్నం మూడు గంటలకు కూర్మాపురం గ్రామంలో నిర్మించిన రైతు భరోసా కేంద్రాన్ని ఆయన ప్రారంభిస్తారన్నారు. మండలంలోని ప్రజాప్రతినిధులు, మండల స్థాయి అధికారులు పాల్గొనాల్సిందిగా కోరారు.

ఓటింగ్‌పై విద్యార్థులకు అవగాహన



మండపేటలో ఓటింగ్ విధానంపై అవగాహన కల్పిస్తున్న తహసీల్దార్

కపిలేశ్వరపురం (మండపేట): ఈవీఎం ద్వారా ఓటు వేసే విధానంపై మండపేట తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు స్వీప్ కార్యక్రమంలో భాగంగా తహసీల్దార్ ఎం.సురేష్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఈవీఎం పనిచేసే విధానం, ఓటరుగా చేపట్టాల్సిన బాధ్యతలను వివరించారు. కార్యక్రమంలో ఎన్నికల డీటీ పీఏ మెహర్‌బాబా, కళాశాల అధ్యాపకులు, రెవెన్యూ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉచిత పశువైద్య శిబిరం



పాడి రైతులకు మందులు పంపిణీ చేస్తున్న ఎంపీపీ నాగమణి తదితరులు

కె.గంగవరం: మండలంలోని భట్లపాలిక గ్రామ సచివాలయం వద్ద శుక్రవారం పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని ఎంపీపీ పంపన నాగమణి, సర్పంచ్ యలమంచిలి పద్మావతి, ఎంపీటీసీ జిల్లెళ్ల బాల సుబ్రహ్మణ్యం తదితరులు రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. వారు మాట్లాడుతూ పశువులకు తరచుగా వచ్చే వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలన్నారు. ఏ సమస్య వచ్చిన పశువైద్యులను సంప్రదించాలని కోరారు. అనంతరం రామచంద్రపురం ఏడీ ఓ.రామకృష్ణ, పశు వైద్యులు సంయుక్త, సురేష్‌బాబు తదితరులు గ్రామంలోని 42 మంది పాడి రైతులకు సంబంధించిన 116 పశువులకు ఉచిత పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు.

మహాశివరాత్రి ఏర్పాట్లపై సమీక్ష

కె.గంగవరం: మండలంలోని కోటిపల్లిలో కొలువైన ఛాయా సోమేశ్వర స్వామి ఆలయం వద్ద మార్చి 8న జరిగే మహాశివరాత్రి ఏర్పాట్లపై ఈ నెల 19న సమీక్ష సమావేశం ఏర్పాటు చేసినట్లు ఆలయ ఈఓ ఎం.శ్రీదేవి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 4 గంటలకు ఆలయం ఆవరణలో సమీక్ష నిర్వహిస్తామని సంబంధిత అధికారులు ఏర్పాట్లు పూర్తి నివేదికతో హాజరు కావాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

గ్రంథాలయాల అభివృద్ధికి కృషి

కపిలేశ్వరపురం (మండపేట): ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని గ్రంథాలయాల అభివృద్ధికి కృషి చేయనున్నట్టు సంస్థ చైర్‌పర్సన్, కేశవరానికి చెందిన దూలం పద్మ తెలిపారు. కేశవరంలో శుక్రవారం ఆమె మాట్లాడుతూ చైర్‌పర్సన్‌గా తనను కొనసాగిస్తూ ఉత్తర్వులిచ్చిన అనంతరం కాకినాడ సంస్థ కార్యాలయంలో శుక్రవారం తొలి సమీక్షా సమావేశాన్ని నిర్వహించామన్నారు. సంస్థ జిల్లా స్థాయి ఉద్యోగులతో సమీక్షించిన అనంతరం క్షేత్ర స్థాయిలోని గ్రంథాలయాల నిర్వహణపై పలు నిర్ణయాలు తీసుకున్నామన్నారు. క్షేత్ర స్థాయిలోని గ్రంథాలయాలను పరిశీలించాలని అధికారులను ఆదేశించామని పద్మ తెలిపారు.

యువకుడికి తీవ్ర గాయాలు


కాజులూరు: గొల్లపాలెంలోని కాకినాడ, కోటిపల్లి రహదారిలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో తాళ్లరేవు మండలం ఇంజరానికి చెందిన యువకుడు కె.దుర్గాప్రసాద్ తీవ్ర గాయాలపాలయ్యాడు. ఈ సంఘటనకు సంబంధించి స్థానికులు, గొల్లపాలెం పోలీసులు తెలిపిన పూర్తి వివరాలిలా ఉన్నాయి. దుర్గాప్రసాద్ ఇంజరం నుంచి కరప మండలం గొర్రిపూడి వెళుతున్నాడు. గొల్లపాలెం కాజులూరు జంక్షన్‌కు వచ్చేసరికి బైక్ అదుపు తప్పి ముందు వెళుతున్న మరో ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టి కింద పడ్డాడు. తీవ్ర గాయాలపాలై అపస్మారక స్థితికి చేరుకున్న అతడిని స్థానికులు 108 అంబులెన్సుపై కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

కోడి పందేలపై దాడి

అయినవిల్లి: మండలంలోని పోతుకుర్రులో కోడిపందేలు నిర్వహించే స్థావరంపై శుక్రవారం అయినవిల్లి ఎస్సై బి.రాజేష్‌కుమార్ తన సిబ్బందితో కలసి దాడి చేశారు. ఈ దాడిలో ఇరువురిని అదుపులోకి తీసుకుని 8 కోడిపుంజులను స్వాధీనం చేసుకున్నారు. వీరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఆసరాతోనే మహిళల ఆర్థిక ప్రగతి

- నాలుగో విడత చెక్కుల పంపిణీ
- పాల్గొన్న ఎంపీలు అనురాధ, బోస్, కోఆర్డినేటర్ సూర్యప్రకాష్



కె.గంగవరంలో లబ్ధిదారులకు ఆసరా చెక్కు పంపిణీ చేస్తున్న ఎంపీలు పిల్లి బోస్, అనురాధ, కోఆర్డినేటర్ సూర్యప్రకాష్ తదితరులు



సమావేశానికి హాజరైన డ్వాక్రా సంఘాల సభ్యులు

కె.గంగవరం: మండలంలో వైఎస్సార్ ఆసరా నాలుగో విడత సంబరాలు ఉత్సాహంగా సాగింది. గత ఎన్నికల్లో డ్వాక్రా మహిళలకు ఇచ్చిన రుణ మాఫీ హామీని వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తరువాత నాలుగు విడతల్లో పూర్తి స్థాయిలో అమలు చేయడంతో మహిళల్లో ఆనందం అంతా ఇంతా కాదు. జగనన్న ప్రభుత్వంలో అందిన ఆసరా సొమ్ముతో తమ కుటుంబాలను చక్కదిద్దుకుంటున్నామని అక్క చెల్లెమ్మలు చెబుతున్నారు. మహిళల సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తున్న సీఎం జగన్‌కే తమ మద్దతు అని ముక్తకంఠంతో చెబుతున్నారు. మండలకేంద్రమైన కె.గంగవరం ఉన్నత పాఠశాల ఆవరణలో శుక్రవారం ఆసరా నాలుగో విడత సంబరాలు జరిగాయి. ఎంపీపీ పంపన నాగమణి అధ్యక్షతన జరిగిన సమావేశంలో రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్‌చంద్రబోస్, ఎంపీ చింతా అనురాధ, రామచంద్రపురం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కోఆర్డినేటర్ పిల్లి సూర్యప్రకాష్, జెడ్పీటీసీ ఓబులనేని రాజ్‌కుమారి, ఎంపీపీ నాగమణి తదితరులు మండలంలోని 26 గ్రామాలకుగాను 1347 డ్వాక్రా సంఘాలకు చెందిన 13472 మంది సభ్యులకు రూ.10 కోట్ల 94 లక్షల 35 వేల చెక్కును నాలుగో విడత ఆసరాగా లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఎంపీ అనురాధ మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు డ్వాక్రా సంఘ మహిళలకు నాలుగు విడతలుగా తమ ఖాతాల్లో కట్టిన సొమ్మును తిరిగి చెల్లించారన్నారు. ఒక్క డ్వాక్రా గ్రూపులకే కాకుండా సమాజంలోని అన్ని వర్గాల ప్రజలకు సీఎం జగన్ మోహన్‌రెడ్డి మేలు చేశారన్నారు. రానున్న ఎన్నికల్లో మళ్లీ వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి మహిళలు మద్దతు తెలిపాలని కోరారు. రాజ్యసభ సభ్యుడు బోస్ మాట్లాడుతూ సమాజంలో అత్యంత తెలివైన వారు ఒక్క మహిళలు మాత్రమేనని.. గత ప్రభుత్వానికి, సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వానికి తేడాను గమనించాలన్నారు. కోఆర్డినేటర్ సూర్యప్రకాష్ మాట్లాడుతూ సీఎం జగన్ ప్రభుత్వం అన్ని వర్గాలకు న్యాయం చేయడంతో పాటు అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా భావించి పాలన జరిగిందన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ పాలనలో పేదలకు మరింత మేలు జరిగిందన్నారు. మరో 60 రోజుల్లో ఎన్నికలు రానున్న తరుణంలో ప్రతి ఒక్కరూ గత ప్రభుత్వానికి, ఇప్పటి ప్రభుత్వానికి తేడాను గమనించి తమ కుటుంబాలకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మేలు చేస్తేనే మళ్లీ మద్దతు తెలపాలని విజ్ఞప్తి చేశారు. డీసీఎంఎస్ డైరెక్టర్ పెట్టా శ్రీనివాస్, మార్కెట్ కమిటీ చైర్మన్ పందు గోవిందరాజు, వైస్ ఎంపీపీ దూడల నాగేశ్వరరావు, నీతిపూడి మధుబాల, మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు గుత్తుల దుర్గ, సర్పంచ్ కోటి లక్ష్మీనరసమ్మ, ఏపీఎం రఘురామ్ పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వైఎస్సార్‌సీపీ నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఇంట్లో అవసరాలకు ఉపయోగించాను



డ్వాక్రా సంఘం ద్వారా పొందిన రుణం సొమ్మును ఇంట్లో అవసరాల కోసం ఉపయోగించాం. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఆసరా పథకంలో 10 వేలుకుపైగా సొమ్ము అందింది, నాలుగు విడతలుగా అందించడం సంతోషంగా ఉంది. ఆసరా ద్వారా రుణ విముక్తి లభించింది.

– కొండేపూడి గంగాభవాని, తామరపల్లి

చాలా సంతోషంగా ఉంది



ఆసరా సొమ్ముతో పాటు పలు పథకాల ద్వారా లబ్ధిపొందాము. ఈ ప్రభుత్వంలో లంచాలు లేకుండా నేరుగా ఖాతాలో ఇచ్చిన సమయానికి సొమ్ములు వస్తున్నందుకు చాలా సంతోషంగా ఉంది. రుణ మాఫీ ద్వారా అందిన సొమ్ము ఇంట్లోని అవసరతలకు చాలా ఉపయోగకరంగా ఉంది.

– వాసంశెట్టి వీరవెంకట రమణ, కె.గంగవరం

ఘనంగా రథ సప్తమి వేడుకలు

రాయవరం: ఆదిత్యుడు, భాస్కరుడు, నమస్కారాల ప్రియుడుగా ప్రసిద్ధి చెందిన సూర్యనారాయణస్వామి వారి పుట్టిన రోజైన రథ సప్తమిని శుక్రవారం మండలంలో భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. సూర్యనారాయణస్వామికి కొబ్బరి పిందెలను చక్రాలుగా, కొబ్బరి ఈనెలతో రథాన్ని ఏర్పరచి చిక్కుడు పూలతో అలంకరించారు. ఆవుపాలను పిడకల పొయ్యిపై పొంగించడంతో పాటు, క్షీరన్నాన్ని భాస్కరుడికి నైవేద్యంగా చెల్లించారు. మహిళలు అత్యంత భక్తిశ్రద్ధలతో స్వామి జయంతిని నిర్వహించారు. వెదురుపాక విజయ దుర్గా పీఠంలో మహిళలు రథసప్తమి పర్వదినాన్ని ఘనంగా జరిపారు. పీఠంలో ఉన్న దినకరుడికి గోక్షీర, నారికేళ, ఫలోదక అభిషేకాలు నిర్వహించారు. సూర్యనమస్కారాలు, అరుణహోమాలు చేశారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు సామూహిక కుంకుమ పూజల్లో పాల్గొన్నారు.

కాజులూరు: మండల గ్రామాల్లో శుక్రవారం రథ సప్తమి పూజలను భక్తులు ఘనంగా జరుపుకొన్నారు. రథసప్తమి రోజు నుంచే వేసవి ప్రారంభమౌతుందని హైందవ భక్తుల విశ్వాసం. ఈ రథసప్తమి రోజున సూర్యభగవానుడు కొత్త రథాలను సిద్ధం చేసుకుని తన పయనాన్ని ప్రారంభిస్తాడని భక్తుల నమ్మకం. అందుకే ఈ రోజు ఆరుబయట తులసి కోట వద్ద సూర్యభగవానుని చిత్రపటాన్ని ఉంచి పండ్లు, ఫలహారాలు నైవేద్యం పెట్టి ఆయనకు పూజలు నిర్వహిస్తారు. చిక్కుడు కాయలతో చేసిన రథాన్ని మండపం చుట్టూ తిప్పుతారు. మండలంలోని అన్ని గ్రామాల్లో మహిళలు రథసప్తమి పూజలు నిర్వహించుకున్నారు. అనంతరం సమీప ఆలయాలకు వెళ్లి స్వామివారు, అమ్మవార్లను దర్శించుకున్నారు.

జగనన్న పాలనలో సంక్షేమ కాంతులు



కుయ్యేరులో స్థానికులతో మాట్లాడుతున్న రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్ చంద్రబోస్

ఎంపీ పిల్లి సుభాష్‌చంద్రబోస్

కాజులూరు: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో రాష్ట్రంలో గడప, గడపకూ సంక్షేమ కాంతులు విరజిమ్ముతున్నాయని రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్‌చంద్రబోస్ అన్నారు. మండలంలోని కుయ్యేరు, రేగుబడవ, చింతల్లంక తదితర గ్రామాల్లో శుక్రవారం రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్‌చంద్రబోస్ పర్యటించి నాయకులు, కార్యకర్తలు ప్రజలను కలుసుకున్నారు. కార్యక్రమంలో భాగంగా కుయ్యేరులో సర్పంచ్ పిల్లి కృష్ణమూర్తి ఆధ్వర్యంలో మహిళలు హారతులిచ్చి బోస్ తదితర నాయకులకు స్వాగతం పలికారు. ఆయన మాట్లాడుతూ ప్రజా సంక్షేమానికి అనుగుణంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మంచి, మంచి పథకాలను రూపొందించడమే కాకుండా దళారుల ప్రమేయం లేకుండా నేరుగా వాటిని లబ్ధిదారులకు అందజేయటంలోనూ సఫలీకృతులయ్యారన్నారు. వలంటీర్ వ్యవస్థ అందుకు ఎంతగానో దోహదపడుతుందన్నారు. ప్రతి పనికీ ప్రజలు మండల కార్యాలయాలకు, జిల్లా కేంద్రాలకు వెళ్లనవసరం లేకుండా గ్రామాల్లో సమస్యలను గ్రామాల్లోనే పరిష్కరించుకునేందుకు వీలుగా సచివాలయ వ్యవస్థను తీసుకువచ్చి అన్ని శాఖల అధికారులను ప్రజలకు అందుబాటులో ఉంచారన్నారు. ఇంత చక్కటి పాలన నిరంతరం అందాలంటే ప్రజలు ఎన్నికలలో ఫ్యాను గుర్తుపై ఓటు వేసి వైఎస్సార్ సీపీని గెలిపించాలన్నారు. కార్యక్రమంలో స్థానిక ఎంపీటీసీ చీకట్ల సత్యనారాయణ, మేకల శ్రీనివాస్, మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు, వివిధ శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

సూర్య నమస్కారాలతో ఆరోగ్యానికి మేలు

యోగా గురువు తొగరు మూర్తి



విద్యార్థులకు యోగాసనాలు నేర్పిస్తున్న మూర్తి



ద్రాక్షారామ భీమేశ్వరాలయ ప్రాంగణంలో సూర్య నమస్కారాలు చేస్తున్న విద్యార్థులు

రామచంద్రపురం: సూర్య నమస్కారాలతో ఆరోగ్యానికి ఎంతో మేలు కలుగుతుందని యోగా గురువు, వాకర్స్ క్లబ్ గౌరవాధ్యక్షుడు తొగరు మూర్తి అన్నారు. రథసప్తమి సందర్భంగా శుక్రవారం కృత్తివెంటి పేర్రాజు పంతులు హార్టికల్చర్ పాలిటెక్నిక్ కళాశాలలో విద్యార్థులకు సూర్య నమస్కారాలు, ఆసనాలు మెడిటేషన్ క్లాసులను చైతన్య ఉచిత యోగా సంస్థ నిర్వహించింది. ఈ కార్యక్రమానికి ముఖ్యతిథిగా హాజరైన యోగా గురువు తొగరుమూర్తి మాట్లాడుతూ భారతదేశ సంస్కృతి సంప్రదాయాలను నేటి తరం యువతీ యువకులకు అందించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. ప్రతి రోజు సూర్య నమస్కారాలు చేయాలని సూర్య నమస్కారాలు 12 ఆసనాలతో కూడిన వ్యాయామం అని ప్రతి ఆసనంలోనూ సంక్షిప్తమైన ప్రాణాయామం ధ్యానం మిళితమై ఉన్న వ్యాయామం ఇమిడి ఉంటుందని తెలిపారు. శ్వాస మీద ధ్యాస పెట్టి సూర్య నమస్కారాలు చేయాలని తెలిపారు. ఈ 12 సూర్య ఆసనాల వలన శరీరంలోని 72 వేల నాడులు శుద్ధి అయ్యి వ్యాధి నిరోధక శక్తి పెరిగి విష పదార్థాలు సహజ సిద్ధంగా తొలగిపోతాయని తెలిపారు. నరాలు, కండరాలు సమతుల్యంగా పనిచేస్తాయని తెలిపారు. రుచి, వాసన, వినికిడి శక్తి, దృష్టి లోపాలతో పాటు శరీరం ముఖం తేజోవంతంగా తయారవుతాయని తెలిపారు. విద్యార్థులు ప్రతిరోజు సూర్య నమస్కారాలు చేయుట వలన జ్ఞాపకశక్తి పెరిగి ఆలోచనలో స్పష్టత, భావ వ్యక్తీకరణలో ప్రజ్ఞ కలిగి ఉన్నత లక్ష్యాలకు చేరువ అవుతారని తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల్లో చదువుకుంటున్న విద్యార్థులు భవిష్యత్ తరాలకు స్ఫూర్తి ప్రదాతలు కావాలనే ఉద్దేశంతో ఇప్పటివరకు 82 యోగా క్లాసులు నిర్వహించానని మూర్తి తెలిపారు. అక్షర కాంతిని, అమృత వాక్కులను జ్ఞాన భిక్షగా పెట్టే ఉపాధ్యాయుల ప్రోత్సాహంతో జాతి రత్నాలుగా ఎదగాలని తద్వారా సమాజంలో మీరు అనుకున్న లక్ష్యాలు సాధించి ఉన్నతవంతులుగా కీర్తిని పొందాలని విద్యార్థులకు మూర్తి పిలుపునిచ్చారు. అధ్యాపకులు, అధికారులు ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలల్లో విద్యార్థులకు సూర్య నమస్కారాలు మెడిటేషన్ వంటి క్లాసులు నిర్వహించాలన్నారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు యోగవిద్యను వాటి విశిష్టతను తెలిపినందుకు హార్టీకల్చర్ పాలిటెక్నిక్ కళాశాల తరపున యోగా గురువు తొగరు మూర్తికి కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో కృత్తివెంటి పేర్రాజు పంతులు హార్టికల్చర్ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ చిన్నబ్బాయి, డాక్టర్ జి.నిస్సీ ఫ్లోరా, కె.వర్షిత, ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

భీమేశ్వరాలయంలో సూర్య నమస్కారాల శిక్షణ

రామచంద్రపురం రూరల్: ద్రాక్షారామ మాణిక్యాంబా సమేత భీమేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో శుక్రవారం రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ ఆధ్వర్యంలో రథసప్తమి పురస్కరించుకుని సూర్యనమస్కారాల శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆర్ఎస్ఎస్ ప్రముఖ్ బీవీ లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో వైవీవీ సత్యానారాయణ, శర్మ మాస్టారు, హనుమంతు, ఆళ్ల బుజ్జి, పిల్లా వీరభద్రంలు సుమారు 40 మంది విద్యార్థులకు సూర్య నమస్కారాలు ఏ విధంగా చేయాలి అన్నదానిపై శిక్షణ ఇచ్చారు. సూర్యనమస్కారాల వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు.

పీచు బొమ్మలకు 'లేపాక్షి'తో మార్కెటింగ్



పాశర్లపూడిలో కొబ్బరి పీచు బొమ్మలను పరిశీలిస్తున్న చైర్‌పర్సన్ విజయలక్ష్మి

మామిడికుదురు: హస్త కళలు దేశానికి వెన్నెముక లాంటివని వాటిని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని రాష్ట్ర హస్తకళల అభివృద్ధి కార్పొరేషన్ చైర్‌పర్సన్ బి.విజయలక్ష్మి పేర్కొన్నారు. పాశర్లపూడిలోని కొబ్బరిపీచు బొమ్మల కేంద్రం గ్రామ దుకాణ్‌ను ఆమె శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా విజయలక్ష్మి మాట్లాడుతూ కోనసీమ అనగానే కేరళ అందాలు గుర్తుకు వస్తాయన్నారు. ఇక్కడి మహిళా హస్త కళాకారులు కొబ్బరి పీచుతో తయారు చేసిన పలు రకాల బొమ్మలు అద్భుతంగా ఉన్నాయన్నారు. వీటిని తయారు చేసిన కళాకారులను ఆమె అభినందించారు. దేశ వ్యాప్తంగా 20 లేపాక్షి ఎంపోరియంలు ఉన్నాయని, వాటి ద్వారా హస్త కళాకారులు తయారు చేసిన బొమ్మలను విక్రయించి మహిళా కళాకారులకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. కోనసీమ క్వాయర్ టాయ్స్‌కు లేపాక్షి ఎంపోరియంల ద్వారా మార్కెటింగ్ సౌకర్యం కల్పిస్తామని చెప్పారు. ఆమె వెంట జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.చంద్రమౌళి, మొల్లేటి తలుపుల రాజా, ప్రసాద్, మునిరెడ్డి పాల్గొన్నారు.

ఏరుపల్లిలో జగనన్న ఆరోగ్య సురక్ష



మందుల కిట్లు అందిస్తున్న సర్పంచ్ ఎం.శ్రీధర్

రామచంద్రపురం రూరల్: మండలంలోని ఏరుపల్లిలో సర్పంచ్ మల్లిమొగ్గల శ్రీధర్ ఆధ్వర్యంలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. సర్పంచ్ శ్రీధర్ మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యం కోసం ఇంతగా పరితపించిన ముఖ్యమంత్రి గతంతో ఎవరూ లేరన్నారు. దివంగత మహానేత ఆరోగ్య శ్రీ పథకాన్ని ప్రవేశపెట్టి పేదలకు కొండంత అండగా నిలిస్తే, ఆయన తనయుడు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆ పథకాన్ని మరింత ప్రయోజనం కలిగించేలా రూ.25 లక్షల వరకు వైద్య సేవలు పొందేలా అమలు చేయడం గొప్ప విషయమని అన్నారు. శిబిరంలో డాక్టర్లు వి.స్వాతి భవాని, బి.సౌమ్య, జి.సుశీల 419 మందికి వైద్య సేవలు అందించారు. 54 మందికి కంటి వైద్య సేవలు అందించారు. సర్పంచ్ శ్రీధర్ చేతుల మీదుగా మందులు అందజేశారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ ఎస్.షెలత్‌రాజు, డివిజనల్ సూపర్‌వైజర్ జి.కమల్‌శేషు, పంచాయతీ కార్యదర్శి సుందర్‌లాల్, సూపర్‌వైజర్లు కె.శ్రీనివాస్, వి.ఈశ్వరమ్మ, డి.రాజేశ్వరి, సచివాలయ సిబ్బంది, వైద్య ఆరోగ్య సిబ్బంది, వలంటీర్లు సహాయ సహకారాలు అందించారు.

అభివృద్ధి, సంక్షేమానికి సమ ప్రాధాన్యం



సచివాలయ భవన శిలాఫలకాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్సీ త్రిమూర్తులు

సచివాలయం-2 ప్రారంభించిన ఎమ్మెల్సీ త్రిమూర్తులు

రాయవరం: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అభివృద్ధి, సంక్షేమానికి సమ ప్రాధాన్యం ఇస్తున్నారని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అన్నారు. చెల్లూరులో సచివాలయం-2 భవనాన్ని సర్పంచ్ పాలిక రాఘవ ఆధ్వర్యంలో శుక్రవారం ఎమ్మెల్సీ త్రిమూర్తులు ప్రారంభించారు. ఎమ్మెల్సీ త్రిమూర్తులు మాట్లాడుతూ జగనన్న పాలనలో ప్రతి గ్రామానికి మేలు జరిగిందన్నారు. సచివాలయ వ్యవస్థ ద్వారా గాంధీ కలలుకన్న గ్రామ స్వరాజ్యాన్ని సాక్షాత్కరింపజేశారన్నారు. మనబడి నాడు-నేడు పథకంలో పాఠశాలలు, పీహెచ్‌సీలు, అంగన్‌వాడీ కేంద్రాలను ఆధునీకరిస్తూ, మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యమిచ్చినట్లు వివరించారు. జగనన్న లే అవుట్లలో అర్హులందరికీ ఇళ్ల పట్టాలు, ఇళ్లు మంజూరు చేసినట్లు తెలిపారు.

భారీ ఊరేగింపుతో స్వాగతం

ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులను పసలపూడి వరకు ప్రజాప్రతినిధులు, పార్టీ నేతలు భారీ ఊరేగింపుతో స్వాగతం పలికారు. మోటార్ సైకిళ్ల ర్యాలీ ఏర్పాటు చేయగా, ఎమ్మెల్సీ త్రిమూర్తులు మోటార్ సైకిల్ నడిపి పార్టీ నేతలను, కార్యకర్తలను ఉత్సాహపరిచారు. మహిళలు పూలజల్లుతో స్వాగతించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ సిరిపురపు శ్రీనివాసరావు, జెడ్పీటీసీ నల్లమిల్లి మంగతాయారు, ఎంపీపీ నౌడు వెంకటరమణ, ఎంపీటీసీలు పలివెల వెంకట ఆదిలక్ష్మి, వైట్ల వీరవేణి, సొసైటీ త్రిసభ్య కమిటీ చైర్మన్ చిక్కాల శ్రీరాములు, పారిశ్రామికవేత్త చైతన్య రాజబాబు, వైఎస్సార్ సీపీ గ్రామ శాఖ అధ్యక్షుడు చోడె వెంకటరమణ, సోషల్ మీడియా మండల కన్వీనర్ తవిటికి రత్నకుమార్, మాజీ ఏఎంసీ చైర్మన్ పాలిక శ్రీను, నేతలు కోటి అంబేద్కర్, పిల్లి పరశురామ్, చిక్కాల గోవిందు, కసే శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంత ఎన్నికలకు ప్రజలు సహకరించాలి



సోమేశ్వరంలో మాట్లాడుతున్న ఎస్సై నరేష్



కోరుమిల్లిలో అవగాహన కల్పిస్తున్న ఎస్సై

రాయవరం: త్వరలో జరగనున్న సాధారణ ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు ప్రజలు సహకరించాలని రాయవరం ఎస్సై జి.నరేష్ కోరారు. సోమేశ్వరంలో శుక్రవారం ఆయన సాధారణ ఎన్నికలు-2024పై అవగాహన సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఎన్నికలకు ఎటువంటి విఘాతం కలగకుండా ఉండే విధంగా ప్రజలు సహకరించాలన్నారు. ఉద్రిక్త వాతావరణం ఏర్పడకుండా ప్రజలు శాంతియుతంగా ఉండాలన్నారు. ప్రతిఒక్కరూ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రతి పోలింగ్ స్టేషన్ వద్ద ఓటర్లు నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకునే పరిస్థితులను ఎన్నికల కమిషన్ ఏర్పాటు చేస్తుందన్నారు. సమావేశంలో తహసీల్దారు ఆర్‌వీ కృష్ణారావు, వీఆర్వోలు పాల్గొన్నారు.

ఎన్నికల నిబంధనలను విధిగా పాటించాలి

కపిలేశ్వరపురం: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఎన్నికల సంఘ నిబంధనలను ప్రజలు విధిగా పాటించాలని, నిబంధనలను అతిక్రమించిన వారిపై చర్యలు ఉంటాయని అంగర ఎస్సై అందే పరదేశి అన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు శుక్రవారం కోరుమిల్లిలో ఎన్నికల విధి విధానాలపై అవగాహన సమావేశం నిర్వహించారు. సర్పంచ్ ఆచంట సత్యనారాయణ, ఎంపీటీసీ సుంకర వెంకటేశ్వరరావు, కార్యదర్శి కామేశ్వరరావు, వార్డు సభ్యులు, పలు రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు పంపిణీ

మలికిపురం: క్యాన్సర్ వ్యాధితో బాధపడుతూ చికిత్స పొందుతున్న చింతలమోరి గ్రామానికి చెందిన కొల్లు వెంకట నాగేంద్రకు మంజూరైన సీఎం సహాయ నిధి రూ.2.40 లక్షల చెక్కును జెడ్పీటీసీ బళ్ల ప్రసన్నకుమారి అందజేశారు. విజయవాడలో చికిత్స పొందుతున్న నాగేంద్రకు వైఎస్సార్ సీపీ రీజనల్ కోఆర్డినేటర్, ఎంపీ మిథున్ రెడ్డి సమక్షంలో చెక్కును పంపిణీ చేశారు. ఆరోగ్యశ్రీ పథకం ద్వారా ఎంతో మంది నిరుపేదలకు ఉచితంగా చికిత్స అందుతుందన్నారు. పార్టీ నాయకుడు బళ్ల రత్నరాజు తదితరులు పాల్గొన్నారు.

అమెరికా నుంచి వచ్చి.. రాములోరి కల్యాణం



అమెరికా నుంచి వచ్చి ద్రాక్షారామలో సీతారాముల కల్యాణం నిర్వహిస్తున్న శేషు, విజయ్ దంపతులు

రామచంద్రపురం రూరల్: తన తాతగారి నూరవ పుట్టినరోజు మరుపురాని ఘట్టంగా నిలవాలని తలచిన మనవరాలు తాము ప్రస్తుతం నివాసం ఉంటున్న అమెరికా నుంచి పనిగట్టుకు భర్తతో కలసివచ్చి రాముల వారి కల్యాణం నిర్వహించింది. వివరాలిలా ఉన్నాయి. ప్రముఖ పుణ్యక్షేత్రం ద్రాక్షారామలో నివాసం ఉంటూ జగన్నాయకులపాలెం కరణంగా పేరుపొందిన దినవహి సూర్యప్రకాశరావు 29 ఏళ్ల క్రితం కాలం చేశారు. ఆయన కుమారుడు దినవహి పెద హనుమంతరావు కుమార్తె తల్లాప్రగడ శేషు, భర్త విజయ్ ఉద్యోగ రీత్యా అమెరికాలో స్థిరపడ్డారు. తన తాతగారి నూరవ పుట్టిన రోజును మరపురాని ఘట్టంగా మలుచుకోవాలన్న తలంపుతో తండ్రితోను, విశాఖపట్నంలో ఉండే అత్తమామలు తల్లాప్రగడ సత్యఅన్నపూర్ణ, వెంకట రామలక్ష్మణరావులతోను సంప్రదించి ఆ రోజున సీతారాముల కల్యాణం చేయించుకోవాలని తలపెట్టింది. అనుకున్నట్లుగానే ద్రాక్షారామలో అరటి చెట్లు, మామిడి తోరణాలు, కొబ్బరి ఆకుల చిలకలు, ప్రత్యేక పూలతో పచ్చని చలువ పందిరి సిద్ధం చేసి రాముల వారి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ వేడుకకు అమెరికా నుంచి ఒక సన్నిహితుడు ప్రత్యేకంగా రాగా, హైదరాబాద్, విశాఖపట్నం, ఏలూరు, విజయవాడ తదితర గ్రామాల నుంచి బంధువులు, సన్నిహితులు, ద్రాక్షారామ వాసులు తరలివచ్చి రాముల వారి కల్యాణాన్ని తిలకించారు. వచ్చిన వారందరికీ అన్న ప్రసాదం వడ్డించారు.